క్లుప్తంగా

ప్రభుత్వ చీఫ్ విప్‌ను కలిసిన నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వ మండలి చీఫ్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావును తెలంగాణ ఉద్యమ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సివిల్ సప్లై మానిటరింగ్ కమిటీ మెంబర్ పడాల సతీశ్‌గౌడ్, నాయకులు నల్లగొండ కుమార్,ఆషాడపు వెంకటేశ్, వంశీకృష్ణ, పవన్ తదితరులున్నారు.

అర్హతలున్న ల్యాబ్ టెక్నీషియన్లకే సహకరించండి


వినతిపత్రం అందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

కోల్‌సిటీ: విద్యార్హతలు ఉన్న ల్యాబ్ టెక్నీషియన్లను మాత్రమే వైద్యులు గుర్తించాలని ల్యాబ్ టెక్నీషియన్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు దామెర అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. రామగుండం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్ల కుమార్, ప్రధాన కార్యదర్శి లంక సదయ్య మాట్లాడారు. అసోసియేషన్‌లో సభ్యత్వం లేని, విద్యార్హతలు లేని టెక్నీషియన్లకు ఐఎంఏ సహకరించవద్దని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి మేకల తిరుపతి, ఉపాధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఎర్రోళ్ల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు, రాజేశం, కృష్ణ, ఐలయ్య, రమేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా వీర జవాన్లకు నివాళి


నివాళులు అర్పిస్తున్న యువకులు

సుల్తానాబాద్‌రూరల్: పుల్వమా దాడిలో మరణించిన వీర జవానులకు సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లిలో వైకే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్ది సాయి కిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పుల్వామాలో వీర మరణం పొందిన జవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరవింద్, నాయకులు అజయ్, అఖిల్, అభిరామ్, కార్తీక్, రంజిత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వీటీసీ కేంద్రం ఏర్పాటు చేయాలి

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ– 3 ఏరియాలో పని చేస్తున్న పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల సౌకర్యం కోసం సెంటినరీకాలనీలోన వీటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఈమేరకు మంగళవారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆర్జీ2లో వీటీసీ కేంద్రం ఇవ్వడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత వీటీసీ కేంద్రం పై అంతస్తులో రెండు గదులను పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల వీటీసీ కేంద్రానికి కేటాయించాలని వెంకన్న కోరారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- అధికారుల తీరుపై సర్పంచుల ఆగ్రహం
- సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలి
- ఎంపీపీ తానిపర్తి స్రవంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి


సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ విజయేందర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలో సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎలిగేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అనేక సమస్యలున్నాయని, సభ్యులు సభలో అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. నెల రోజుల్లో 10 వ తరగతి పరీక్షలు ఉన్న తరుణంలో సుల్తాన్‌పూర్‌లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ బదిలీయడం ఏమిటని సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు ఎంఈవోను ప్రశ్నించారు.ర్యాకల్‌దేవ్‌పల్లి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీని రెవెన్యూ అధికారులకు పట్టించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా జేసీబీ వదిలేశారని సర్పంచ్ విజయేందర్‌రెడ్డి తహసీల్దార్‌ను నిలదీశారు. ఉపాధిహామీలో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సభల్లో పలువురు సభ్యులు ప్రశ్నించగా సమాధానం దాటవేశారు. వివిధ శాఖలపై సభలో చర్చించారు.అనంతం ఎంపీపీ స్రవంతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. మండలానికి చెందిన తానిపర్తి భానుప్రసాదరావును శాసనమండలి చీఫ్ విప్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, ఎమెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నేతృత్వంలో మండలంను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, తహసీల్దార్ నాగరాజమ్మ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి,ఎంపీవో అనిల్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ప్రజాసమస్యల పరిష్కారానికి ఇంటింటికీ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గడపగడపకు కేసీఆర్ సంక్షేమ ఫలాలు– ఇంటింటి చందరన్న పాదయాత్రకు మంగళవారం విశేష స్పందన లభించింది. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఆయా డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ఇంటింటికీ పాదయాత్ర చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ఏదేశంలో లేని సంక్షేమ పథకాలు ప్రభుత్వం మన రాష్ట్రంలో అమలు చేస్తోందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని తీసుకువెళ్లాలనే ప్రజల్లో తిరుగుతున్నామని తెలిపారు. మహిళలు కుటీర పరిశ్రమలు, తినుబండారాల తయారీ వ్యాపారాలు చేసినట్లయితే ప్రభుత్వపరంగా రుణం మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, నాయకులు మెతుకు దేవరాజ్, ఆడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

రామగుండం మెడికల్ కళాశాలకు సింగరేణి మెడికల్ వైద్య కళాశాలగా నామకరణం చేయాలని అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వాన్ని ఒప్పించిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు టీబీజీకేఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గండ్ర దామోదర్‌రావు, కనకం శ్యాంసన్, పర్లపల్లి రవి, శంకర్, చెలకలపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కోడిపుంజుల రాజయ్య

రామగుండం: ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు జారీ చేయాలని, 2022 నాటి అటవీ సంరక్షణ చట్టాలు ఉప సంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోడిపుంజుల రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పోడు భూముల సదస్సులో పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం 5వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా ఆదివాసీలకు ఇచ్చిన హక్కులు, అటవీసంరక్షణ నియమాలను హరించి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామసభలు, పీసా యాక్ట్ లాంటి అనేకమైన హక్కులు ఆదివాసీలకు రక్షణగా నిలిచాయన్నారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కొల్లూరి మల్లేష్, ఐ.కృష్ణ, నరేశ్, అబేద్నేగో, మేరుగు చంద్రయ్య, మొగిలి, ఆనంద్, వేల్పుల సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజలు కంటి పరీక్షలు చేసుకోవాలి


లాలపల్లిలో వైద్య‌శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్

ఎలిగేడు: కంటివెలుగులో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మంగళవారం మండలంలోని లాలపల్లిలో కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో 137 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 34 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, సీహెచ్‌వో, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: జూలపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరంలో మంగళవారం 174మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25మందికి కంటి అద్దాలను అందించగా వడుకాపూర్‌లో నిర్వహించిన కంటి వెలుగు వైద్యశిబిరంలో 17మందికి కంటి పరీక్షలు చేసి 52మందికి కంటి అద్దాలను అందజేసిన ట్లు మెడికల్ ఆఫీసర్ సంపత్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ధారబోయిన నర్సింహయాదవ్, తిరుపతి, కంటి వెలుగు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాపు, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని ఆదివారంపేటలో మంగళవారం కంటి వెలుగు క్యాంపును ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. కంటి జబ్బులతో భాధపడుతున్న వారికి కంటి వెలుగు ఎంతో ఉపయుక్తంగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మైదం కుమార్, ఎంపీటీసీ మేడగోని ఉమా, ఎంపీఓ కాటం భాస్కర్, వైద్య సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్: మంథనిలోని ఎస్ఎల్‌బీ ఫంక్షన్ హాల్లో ఈ నెల 20న పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. నలభైకి పైగా కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తాటికొండ శంకర్, కొండ వెంకటేష్, ఉప సర్పంచ్‌లు జాబు సతీష్,చందు, నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

జ్యోతినగర్: ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పో లీసుల వివరాలు.. రామగిరి శ్రీనివాస్– రాణి భార్యాభర్తలు. కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్నారు. శ్రీనివాస్ ఈ నెల 10న ఇంట్లో గొడవపడి ఉదయం 6 గంటలకు వెళ్లిపోయాడు. నాలుగు రోజులుగా అ తడి గురించి తెలిసినవారు, బంధువులు, చు ట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో శ్రీనివాస్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జీవన్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిస్తే రామగుండం సీఐ– 87126 56524, ఎన్టీపీసీ ఎస్సై– 87126 56526 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

జరిమానా చెల్లించి జైలు నుంచి విడుదల

గోదావరిఖని: బైండోవర్ నిబంధనలు అధిగమించి గుడుంబా అమ్మకాలు చేపట్టిన రామగుండం ఎస్టీ కాలనీకి చెందిన అజ్మీర లక్ష్మణ్ జైలు జీవితం నుంచి విడుదలయ్యేందుకు రూ.లక్ష జరిమానా చెల్లించినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు. గుడుంబా అమ్మడం వృత్తిగా ఎంచుకున్నాడని, ఎక్సైజ్ పోలీసులు నిఘా వేసి పట్టుకుని రామగుండం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అయినా అతను మళ్లీ గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడటంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా ఏడాది జైలు శిక్ష విధించారు. రెండు నెలల జైలు శిక్ష అనంతరం తాను జైలులో ఉండలేనని, జరిమానా చెల్లిస్తానని తహసీల్దార్‌కు మొర పెట్టుకోగా అనుమతించారు. ఈక్రమంలో రూ.లక్ష బ్యాంకు చలానా రూపంలో ఎక్సైజ్ అధికారులకు చెల్లించి జైలు నుంచి విడుదలయ్యాడు.

ఆలయానికి గ్రంథాలయ చైర్మన్ విరాళం

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ రూ.10,116 లను విరాళం అందజేశారు. కార్యక్రమంలో నేనున్నా ఫౌండేషన్ గ్రామ కోఆర్డినేటర్ మద్ది శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రవీందర్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ఎంపీటీసీ విరాళం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, కిష్టంపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ, ముత్యాల పోచమ్మ ఆలయాల అభివృద్ధి కోసం సుందరం ఫౌండర్, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి మంగళవారం రూ. 10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్, దామెర సంపత్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఎలిగేడు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండలంలోని ధూళికట్టలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీవైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుకతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ నెల 17 సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, రైతు సమన్వసమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, సర్పంచ్‌లు కావేరి మాద కొండాల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జెడ్పీ చైర్మన్ పరామర్శ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, రాజాపూర్ గ్రామాలకు చెందిన దండె సతీశ్, పసులోటి చంద్రయ్య, పిడుగు భీమయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను మంగళవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్ తాటికొండ శంకర్, ఉప సర్పంచ్ రాసకొండ చందు, నాయకులు ఉన్నారు. ఎగు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

ఇండియా పోస్ట్ పేమెంట్ సేవలు వినియోగించుకోవాలి

పెద్దపల్లిరూరల్: పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఆధ్వర్యంలో అందిస్తున్న పలు రకాల సేవలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇండియా పోస్ట్‌పేమెంట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీ లో మంగళవారం వాణిజ్యశాస్త్ర విభాగం టీఎస్‌కేసీ, ఇండియా పోస్ట్‌పేమెంట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు నగదు రహిత లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉంటూ అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ పేమెంట్ విధానం పెరిగిందన్నారు. చిన్న లావాదేవీ కూడా డిజిటల్ పద్ధతిన యూపీఐ నుంచి చెల్లిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి జ్యోతి జీవన్ బీమా యోజన గురించి, ఇతర బీమా సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్ నితిన్, కెప్టెన్ సంజీవ్, కామర్స్ హెచ్‌వోడీ రామకృష్ణ, తిరుపతి, పోస్టల్ బ్యాంకు మేనేజర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యమ ఐక్యతకు అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు

రామగుండం: దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు పార్టీలతో చర్చలు జరిపి సంయుక్తంగా అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇన్షియేటివ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు గడ్డం సదానందం అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాసిస్టు మోడీ పాలనకు ప్రజలు చరమగీతం పట్టే విధంగా ఫాసిస్టేతర రాజకీయ ఫ్రంట్ నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలోని జెన్‌కో బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి గూడూరి వైకుంఠం, రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి దేవరాజ్, బింగి సుధాకర్, రమాదేవి తదితరులున్నారు.

ధూళికట్టలో వైభవంగా ఎల్లమ్మ బోనాలు


ధూళికట్టలో బోనాలతో వస్తున్న మహిళలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో శ్రీరేణుక –ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దాదాపు 130 గౌడ కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని బైండ్ల పూజారులు డప్పు,చప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. 15న ఎల్లమ్మ లగ్గపట్నం, 16 న నాగవెల్లి పట్నం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆ సంఘం అధ్యక్షుడు భుసారపు నర్సయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేశంగౌడ్, కొమురయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని రహదారులపై నాటిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావుకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ఈ మొక్కలను భారీగా నాటించారని, వీటితో మనుషులకు శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయని పర్యావరణ నిపుణులు వెల్లడిస్తున్నప్పటికీ, బల్దియా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే చెట్లను తొలగించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కన్వీనర్ చంద్రగిరి కృష్ణ కుమార్, కోకన్వీనర్ మొగిలిచర్ల సురేశ్ పాల్గొన్నారు.

కలుషిత నీటితో గ్రామస్తుల ఇక్కట్లు


కలుషిత నీటిని చూపిస్తున్న గ్రామస్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మొగల్‌పహాడ్ లోని యాదవ కాలనీలో భూగర్భ జలాలు కలుషితమై బోర్‌వెల్ నుంచి కలుషిత నీరు వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కేవలం రెండు కాలనీలకు మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందని, గ్రామానికి ఎత్తులో యాదవ కాలనీ ఉండడంతో భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఫలితంగా కాలనీవాసులు బోర్‌వెల్స్‌తోనే తాగునీరు, ఇతర అవసరాలను తీర్చుకుంటున్నారు. కాగా బోర్‌వెల్ నుంచి నీరు దుర్వాసన, రంగు మారి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కృష్ణను వివరణ కోరగా నీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపించామని రిపోర్టు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

రామగుండం: రైల్వేస్టేషన్ సమీపంలోని కొండపై నెలకొన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 27 వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో ప్రారంభమైన వేడుకల్లో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు.పూజల్లో బ్రహ్మశ్రీ గట్టు నరహరి శర్మావధాని బృందం, ఆలయ పూజారి రాంపెల్లి శ్రీనివాస్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కస్నూరి సతీష్‌కుమార్, కార్యదర్శి కలవేణి మల్లేశం, ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం రామగిరి మండలం ముస్త్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పిండివంటలు, స్వీట్స్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, మండల నోడల్ అధికారి సదయ్య, పాఠశాల హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ నాయకులు ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల కుమారస్వామి, నందిని, ఉపేందర్, కన్వేయన్స్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓదెలు, లింగయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయాల వద్ద మహా శివరాత్రి కోసం ఏర్పాట్లను పాలకవర్గాలు ఏర్పాటు చేస్తున్నాయి. మంగళవారం పూసల సుల్తానాబాద్ గుడి మిట్టపల్లి శివాలయాల వద్ద మున్సిపల్ కార్మికులు శుభ్రం చేయించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత తెలిపారు. ఈనెల 18న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు, శివకళ్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో ఉదయం 4:30కే మహాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు శివపార్వతుల కల్యాణం జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ఆలయ అర్చకులు అశోక్ శర్మ పంచామృతాలతో అభిషేకం చేశారు.అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన గురు స్వామి లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ప్రభంజన్ రెడ్డి, రమణ, గోవర్ధన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కమ్యూనిటీ ఇన్నోవేటర్ ఫెలోషిప్‌కు ఎంపిక

ఓదెల: జాతీయ స్థాయి కమ్యూనిటీ ఇన్నోవేటర్ ఫెలోషిప్‌కు ఓదెల మండల కేంద్రానికి చెందిన యువకుడు ఒల్లాల ప్రవీణ్ ఎంపికయ్యాడు. నీతి అయోగ్, అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచినందుకు, రోబోటిక్స్‌లో చేస్తున్న కృషికి ఫలితంగా ఈ ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు ప్రవీణ్ తెలిపారు. రోబోటిక్స్, స్టెమ్ ఎడ్యుకేషన్‌లో గత నాలుగేళ్లుగా కృషికి ఫెలోషిప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

కాపులపల్లిలో గడ్డివాము దగ్ధం

పెద్దపల్లిరూరల్: కాపులపల్లి గ్రామానికి చెందిన బోడ పెంటయ్య అనే రైతు గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఇళ్లకు సమీపంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో గ్రామస్తులు ఆందోళన పడ్డారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

గోదావరిఖని: చలో హైదరాబాద్ వెళ్తున్న బీఎంఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తు బీఎంఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధమవుతున్న నాయకులను అన్యాయంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో సారంగపాణి, మాదాసు రవీందర్, ఆకుల హరిణ్, సతీష్, కుమారస్వామి తదితరులున్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com